
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
శుక్రవారం 15 మార్చి 2024



సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ శ్రీధర్‌కు బదిలీ


బి.శ్రీధర్

సీలేరు, మార్చి 14: సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్(సీఈ) బి.శ్రీధర్‌కు బదిలీ అయ్యింది. విజయవాడలోని ఏపీ జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అయన సీలేరు కాంప్లెక్సు సీఈగా 2023 ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టారు. కాగా ఆయన స్థానంలో కొత్త సీఈగా ఇంకా ఎవరినీ నియమించలేదు. ఈ నెలాఖరు వరకు సీలేరు కాంప్లెక్సు సీఈగా శ్రీధర్‌నే కొనసాగించనున్నట్టు జెన్‌కో అధికార వర్గాల ద్వారా తెలిసింది.

కూటమి దూకుడు

అభ్యర్థుల ప్రకటనలో ముందున్న టీడీపీ, జనసేన

- జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలకూ ఖరారు
- నర్సీపట్నం, పాయకరావుపేట, అనకాపల్లికి గతంలోనే ఖరారు
- తాజాగా మిగిలిన నాలుగింటికి అభ్యర్థులు ప్రకటన
- చోడవరం నుంచి కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల నుంచి పైలా ప్రసాదరావు
- పంచకర్ల పెందుర్తి, విజయకుమార్‌కు ఎలమంచిలి..


కేఎస్ఎన్ఎస్ రాజు


పైలా ప్రసాదరావు


పంచకర్ల రమేశ్‌బాబు


సుందరపు విజయకుమార్

అనకాపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలకు ఒకటి, రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు వుండడంతో అభ్యర్థుల ఎంపికను ప్రధాన రాజకీయ పార్టీలు వేగవంతం చేశాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించడంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఒకింత ముందున్నాయి. ఈ రెండు పార్టీలతోపాటు బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అనకాపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను టీడీపీ నాలుగు, జనసేన మూడు స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కేటాయించనున్నట్టు చెబుతున్నారు. అసెంబ్లీ స్థానాల్లో టీడీపీకి కేటాయించిన నర్సీపట్నం నుంచి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట నుంచి వంగలపూడి అనిత, జనసేన పార్టీకి కేటాయించిన అనకాపల్లి సెగ్మెంట్ నుంచి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పేర్లను గత నెల 24వ తేదీన ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా ప్రకటించిన విషయం తెలిసింది. మిగిలిన నాలుగు నియోజకవర్గాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను గురువారం ప్రకటించారు. తెలుగుదేశం పార్టీకి కేటాయించిన చోడవరం నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల నుంచి పైలా ప్రసాదరావు పోటీ చేస్తారని పార్టీ అధినేత చంద్రబాబు వెల్లడించారు. ఇక జనసేన పార్టీకి కేటాయించిన పెందుర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ పేర్లను అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. దీంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. అయ్యన్న, అనిత, కొణతాల ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించగా, తాజాగా టికెట్లు ఖరారైన అభ్యర్థులు మంచి ముహూర్తం చేసుకుని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. ఇక అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో అభ్యర్థి ఎంపికపై పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నది.

రంపచోడవరం టీడీపీ అభ్యర్థిగా శిరీషాదేవి

- సామాజిక, విద్యా అంశాల ఆధారంగా అభ్యర్థిని ఖరారు చేసిన చంద్రబాబు


మిరియాల శిరీషాదేవి

రంపచోడవరం, మార్చి 14: రంపచోడవరం టీడీపీ అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవి అనే విద్యావంతురాలైన గిరిజన యువతిని ఖరారు చేస్తూ తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు గురువారం నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే విషయంలో తీవ్ర స్థాయిలో వడబోత సాగించి పార్టీ ఎట్టకేలకు మిరియాల శిరీషను ఎంపిక చేశారు. ఇక్కడ టికెట్ కోసం ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేశ్, పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న వంతల రాజేశ్వరి, పార్టీలోని సీనియర్ నాయకులు కూడా ప్రయత్నాలు సాగించారు. కాగా అరకు పార్లమెంట్‌కు బీజేపీ తరపున బరిలో నిలుస్తున్న కొత్తపల్లి గీత ఆశీస్సులు మెండుగా ఉండడం మిరియాల శిరీషకు కలిసి వచ్చింది. మిరియాల శిరీష కోయ సామాజిక వర్గానికి చెందిన మహిళ. గతంలో ఎమ్మెల్యేలుగా పని చేసిన చోడి మల్లికార్జున, కారం బాపన్నదొరలతో ఆమె కుటుంబానికి బంధుత్వం ఉంది. విలీన మండలాలతో కలిపి నియోజకవర్గంలో ఆమె సామాజిక వర్గం ఓటర్లు అధికంగా ఉండడం, ఆమె భర్త సామాజిక వర్గం కూడా సానుకూలంగా మారి ఆమెకు కలిసివచ్చే అంశంగా ఉంది. డిగ్రీతో పాటు బీఈడీ చేసిన ఆమె అంగన్‌వాడీ కార్యకర్తగా గతంలో పనిచేశారు. అయితే ఎమ్మెల్సీ అనంతబాబు వేధింపులతో ఆమె ఆ పోస్టుకు రాజీనామా చేశారు. శిరీష అత్తమామలు అనంతగిరికి సర్పంచులుగా పని చేశారు. ఆమె భర్త మఠం విజయభాస్కర్ తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

గాజువాకపై వీడిన ఉత్కంఠ

- తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పల్లా శ్రీనివాసరావు ఖరారు


పల్లా శ్రీనివాసరావు

గాజువాక అసెంబ్లీ నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ తమ అభ్యర్థిగా గురువారం పల్లా శ్రీనివాసరావును ప్రకటించింది. దీంతో గత కొద్దిరోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. పొత్తులో భాగంగా గాజువాక సీటును జనసేన పార్టీకి కేటాయిస్తారని, పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఇరు పార్టీల నేతల్లోను ఉత్కంఠ నెలకొంది. అయితే జనసేన అధినేత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో గాజువాకలో పల్లా శ్రీని వాసరావుకు ... మిగతా 8వ పేజీలో

ఏకలవ్యలో ప్రవేశాలకు వేళాయె

దరఖాస్తుల స్వీకరణకు 31 వరకు గడువు

వచ్చే నెల 13న ప్రవేశానికి రాత పరీక్ష

- కార్పొరేట్ స్థాయిలో సదుపాయాలు
- ఆరు నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య
- జిల్లాలో 17 పాఠశాలలు
- ఆరో తరగతిలో 60 సీట్లు


చింతపల్లి ఈఎంఆర్ పాఠశాల

చింతపల్లి, మార్చి 14: **ఆదివాసీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో (ఈఎంఆర్ఎస్) ఆరో తరగతిలో ప్రవేశాలకు గురుకులం అధికారులు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. నవోదయ పాఠశాలకు దీటుగా కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఈఎంఆర్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ పాఠశాలలు నడుస్తున్నాయి.**


ట్యాబ్‌లు వినియోగించి చదువుకుంటున్న విద్యార్థులు

దేశ వ్యాప్తంగా గిరిజన ప్రాంతంల్లో 750 ఈఎంఆర్ పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం దశలవారీగా ఏర్పాటు చేసింది. ఏపీలో 28 పాఠశాలలు ఉండగా, 17 పాఠశాలలు అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే ఉన్నాయి. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి మండలంలో ఒక పాఠశాల ఉంది. ఈఎంఆర్ పాఠశాలల్లో కో-ఎడ్యుకేషన్, ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన జరుగుతున్నది. సువిశాలమైన 30 ఎకరాల విస్తీర్ణంలో ఈ పాఠశాలలను నిర్మించారు. జిల్లాలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, మారేడుమిల్లి, చింతూరు, రాజవొమ్మంగి పాఠశాలలకు శాశ్వత భవనాలు అందుబాటులో ఉన్నాయి. శాశ్వత భవనాలు అందుబాటులోకిరాని పాఠశాలలను వైటీసీలు, గురుకుల పాఠశాలల్లో ప్రత్యామ్నాయ భవనాలు కేటాయించి విద్యాబోధన కొనసాగిస్తున్నారు. ఆరో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచిత విద్యను అందుతుంది.

ఆరో తరగతిలో 60 సీట్లు

ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాలల్లో ఆరో తరగతిలో 60 సీట్లు ఉన్నాయి. 30 సీట్లు బాలికలు, మరో 30 సీట్లు బాలురకు కేటాయించారు. వీటిలో 48 సీట్లు గిరిజన బాలబాలికలకు కేటాయించారు. పీవీటీజీలకు 3, దివ్యాంగులు, సంచార ... మిగతా 8వ పేజీలో

దరఖాస్తు చేసేందుకు పాఠశాలను సంప్రతించవచ్చు



ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సమీపంలోని ఈఎంఆర్ పాఠశాలను తల్లిదండ్రులు సంప్రతించవచ్చు. దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్థి సంతకంతో ఈఎంఆర్ పాఠశాలకు వస్తే ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తాం. బయట ఇంటర్నెట్ సెంటర్లలోనూ ఏపీటీడబ్ల్యూగురుకులం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్ అవుట్‌ను కచ్చితంగా సమీపంలోని ఈఎంఆర్ పాఠశాలకు అందజేయాల్సి వుంటుంది.

- **బి.అన్నామణి**, ప్రిన్సిపాల్, ఈఎంఆర్ఎస్, చింతపల్లి

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ

స్టేషన్‌లో సెటిల్‌మెంట్

- అందుకుగాను రూ.30 వేలు డిమాండ్
- రూ.పది వేలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం
- లంచం ఇవ్వనంటే బాధితుడి స్నేహితుడి వద్ద ఫోన్ లాక్కుని...
- డబ్బులు ఇచ్చి తీసుకువెళ్లమన్న అధికారి


లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరిలోవ ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీనికి సంబంధించి అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన ఒకరు విశాఖ నగరంలోని ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద కారు కొనుగోలు చేశారు. కారుపై ఉన్న ఫైనాన్స్‌ను ప్రతి నెలా కొనుగోలుదారే చెల్లించుకునేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా కారు కొనుగోలు చేసిన వ్యక్తి కొన్ని నెలలుగా ఫైనాన్స్ వాయిదాలను చెల్లించలేకపోయారు. కారును విక్రయించిన వ్యక్తికి బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో వారం కిందట ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేయకుండా ఇరువర్గాలను కూర్చోబెట్టి సెటిల్‌మెంట్ చేశారు. ఇప్పటివరకూ పెండింగ్‌లో ఉన్న వాయిదాలకు సంబంధించిన మొత్తంతోపాటు కారును కూడా వెనక్కి ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. కేసు సెటిల్ చేసినందుకు తనకు రూ.30 వేలు ఇవ్వాలని కారును కొనుగోలు చేసిన విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన వ్యక్తిని ఎస్ఐ హరికృష్ణ డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బుల్లేవని, ఇప్పటికే అప్పుల పాలైపోయానని బాధితుడు చెప్పారు. దీంతో కేసు కట్టకుండానే వివాదాన్ని సెటిల్ చేశానని, కనీసం రూ.పది వేలు అయినా ఇవ్వాల్సిందేనని ఎస్ఐ హరికృష్ణ స్పష్టంచేశారు. ఆ మొత్తం కూడా లేదని బాధితుడు చెప్పడంతో అతడితోపాటు ... మిగతా 8వ పేజీలో

దొంగలు బాబోయ్ దొంగలు

- కత్తులు, తుపాకులతో స్వైర విహారం
- వరుస చోరీలతో భీతిల్లుతున్న జనం

ముంచంగిపుట్టు, మార్చి 14: **మండల పరిధిలో గత కొద్ది రోజులుగా చోరీలు పెరిగాయి. దొంగలు కత్తులు, తుపాకులతో దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్నారు. దీంతో జనం భీతిల్లుతున్నారు.**

మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు కత్తులు, తుపాకులతో ఓ ఇంట్లోకి ప్రవేశించి భారీగా బంగారం, నగదు అపహరించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరువకముందే మండల కేంద్రంలో గల నాలుగు రోడ్ల కూడలి సమీపంలో బుధవారం రాత్రి ఓ కిరాణా షాప్‌లో దొంగలు చొరబడ్డారు. షాప్ ముందు ఉన్న ఇనుప తలుపును తొలగించి లోపలికి ప్రవేశించి తినుబండారాలను ఎత్తుకుపోయారు. పలు సామాన్లను చిందర వందర చేశారు. అలాగే ఇటీవల జోలాపుట్టు మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తులు కత్తులు చూపించి సుమారు రూ.5 వేలు తీసుకున్నారని తెలిసింది. గత నెలలో స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని ఓ కిరాణా షాప్ యజమాని ఇంటి ఆవరణలో ఉంచిన డ్రింక్ బాటిళ్లు, తినుబండారాలను దొంగలు ఎత్తుకుపోయారు. ఇలా తరచూ మండలంలో గత కొద్ది రోజులుగా చిన్నాచితక దొంగతనాలతో పాటు భారీ చోరీలు జరుగుతున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జలాశయాలపై కానరాని గస్తీ

ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలను కలిపే జోలాపుట్టు, డుడుమ జలాశయాల వద్ద గస్తీ కానరావడం లేదు. ఆయా జలాశయాల వద్ద ప్రాజెక్టుకు సంబంధించిన సెక్యూరిటీ గార్డులు నిరంతరం గస్తీ నిర్వహించాల్సి ఉంది. అలాగే అటుగా రాకపోకలు సాగించే వాహనాల నంబర్లను, ఇతర వివరాలను రికార్డు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనాల పూర్తి వివరాలను అడిగి తెలుసుకొని పంపించాల్సి ఉంది. కానీ ఆయా జలాశాయాల వద్ద వాహన తనిఖీలు సక్రమంగా జరగడం లేదు. అలాగే అటుగా రాకపోకలు సాగించే వాహనాల వివరాలను సైతం రికార్డు చేయడం లేదు. ఇదే అదనుగా దొంగలు తమ పనిని సులువుగా చేసుకొని ఆయా జలాశయాల మీదుగా ఒడిశా వైపు వెళ్లిపోతున్నట్టు తెలిసింది. ఇటీవల మాకవరంలో భారీ చోరీ చేసిన దొంగల ముఠా కత్తులు, తుపాకులతో ఒక వాహనంపై డుడుమ జలాశయం పైనుంచే ఒడిశా వైపు వెళ్లినట్టు సమాచారం. గతంలో ఒడిశాకు చెందిన ద్విచక్ర వాహన దొంగల ముఠా మండల కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల్లో సుమారు 18 ద్విచక్ర వాహనాలను ఎత్తుకుపోయిన విషయం తెలిసిందే. అయితే అప్పట్లో ముంచంగిపుట్టు పోలీసులు చాకచక్యంగా ఒడిశాకు చెందిన ద్విచక్ర వాహన దొంగల ముఠాను పట్టుకున్నారు. ప్రస్తుతం చోరీలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాల పోలీసులు భద్రత కట్టుదిట్టం చేసి చోరీలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ కె.రవీంద్ర వివరణ కోరగా మాకవరంలో నాలుగు రోజుల క్రితం జరిగిన భారీ చోరీపై దర్యాప్తు చేస్తున్నామని, ఇది అంతర్రాష్ట్ర దొంగల పనేనని భావిస్తున్నామన్నారు. చోరీల నియంత్రణకు రాత్రి గస్తీ ఏర్పాటు చేశామని చెప్పారు.


మాకవరంలోని ఓ ఇంట్లోకి దొంగలు తుపాకులతో ప్రవేశించి బంగారం, నగదు అపహరించి వస్తువులను చిందర వందర చేసిన దృశ్యం (ఫైల్)


ముంచంగిపుట్టులో బుధవారం రాత్రి ఓ కిరాణా షాపులో సామాన్లను చిందర వందర చేసిన దృశ్యం

కరుగొండ ఘాట్‌లో ఆటో బోల్తా

- ఒకరికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుడిని పరామర్శించేందుకు బైక్‌పై వస్తూ మరొకరికి గాయాలు


లగిసపల్లి లోయలో పడిన ఆటో


గాయపడిన రాజ్‌కుమార్, అర్జున్

పెదబయలు, మార్చి 14: గోమంగి పంచాయతీలోని కరుగొండ ఘాట్ రోడ్డులో ఆటో అదుపు తప్పి లగిసపల్లి లోయలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పరామర్శించడానికి బైక్‌పై బయలుదేరిన అతని బంధువు రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాల య్యాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. వంకరాయి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గడుతుల రాజ్‌కుమార్ గురువారం గోమంగి పంచాయతీ కరుగొండ గ్రామం నుంచి పెదబయలు ఆటోలో బయలుదేరాడు. ఆటో యజమాని గడుతుల తిరుపతిరావు కూడా అతనితో ఉన్నాడు. కరుగొండ ఘాట్ లగిసపల్లి వద్దకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిల్ అయ్యి ఆటో లోయలో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలుకాగా, తిరుపతిరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రులకు వైద్యుడు నిఖిల్ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను పరామర్శించేందుకు అతని బాబాయ్ అర్జున్ ద్విచక్ర వాహనంపై పాడేరు బయలుదేరాడు. సీకరి పంచాయతీ బంగారుమెట్ట ఘాట్ వద్దకు వచ్చేసరికి ఆవు అడ్డంగా రావడంతో దానిని ఢీకొని అతను రోడ్డుపై పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు.

అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అరకులోయ, మార్చి 14: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల నుంచి సీపీఎం పోటీ చేస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటించారు. గురువారం అరకులోయలో ఓ ప్రైవేటు రిసార్టు సమావేశ మందిరంలో అల్లూరి జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు అప్పలనర్స ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అభ్యర్థులను ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తామన్నారు. అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు లోకనాథం, సురేంద్ర, అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు అసెంబ్లీ సీటు టీడీపీకే కేటాయించాలి

- పార్టీ నియోజకవర్గ నేతలు, కార్యకర్తల డిమాండ్


పాడేరులో టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న సోమెలి చిట్టిబాబు, పక్కన గిడ్డి ఈశ్వరి


హాజరైన టీడీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు

పాడేరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీకే కేటాయించాలని నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారనే సమాచారంతో నియోజకవర్గంలోని ముఖ్యనేతలంతా గురువారం స్థానిక టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఇంటికి చేరుకుని సమావేశం నిర్వహించారు. అధిష్ఠానం పునరాలోచించి స్థానిక అసెంబ్లీ స్థానంలో టీడీపీ అభ్యర్థినే బరిలోకి దించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, టీడీపీ నేతలు సోమెలి చిట్టిబాబు, డి.వెంకటరమణ, నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, కార్యకర్తలు, క్లస్టర్, బూత్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.10
సహరి (శని)	4.52

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు.
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సర్కులేషన్‌లో ఏలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరును సంప్రదించగలరు.
9985411029

క్రైం... crime news

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


జామి సన్యాసినాయుడు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, మార్చి 14: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని వడ్డాది పంచాయతీ శివారు కొత్తూరులో చోటుచేసుకుంది. ఈ సంఘటకు సంబంధించి ఎస్‌ఐ డి.ఈశ్వరరావు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

దేవరాపల్లికి చెందిన జామి సన్యాసినాయుడు(36)కు వడ్డాది పంచాయతీ శివారు కొత్తూరు గ్రామానికి చెందిన వరలక్ష్మితో సుమారు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. సన్యాసినాయుడు కొత్తూరులోనే ఇల్లు అద్దెకు తీసుకుని భార్యతో ఇక్కడే కాపురం పెట్టాడు. స్థానికంగా కలాసీ, తాపీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు వున్నారు. అయితే మూడేళ్ల నుంచి భార్యాభర్తల మధ్య సఖ్యత లోపించి తరచూ గొడవ పడుతున్నారు. పిల్లలను తీసుకుని సొంతూరు దేవరాపల్లి వెళ్లిపోదామని చెప్పగా, భార్య ఒప్పుకోలేదు. ఈ నేథప్యంలో బుధవారం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. వరలక్ష్మి పిల్లలను తీసుకుని సమీపంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంటిలో సన్యాసినాయుడు ఒక్కడే వున్నాడు. బుధవారం రాత్రి పక్కంటి వారు సన్యాసినాయుడు ఇంటి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కి ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ఈ విషయాన్ని వరలక్ష్మికి చెప్పడంతో పిల్లలను తీసుకుని ఇంటికి వచ్చింది. సన్యాసినాయుడు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. దేవరాపల్లి నుంచి సన్యాసినాయుడు కుటుంబ సభ్యులు కూడా వచ్చారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

భర్తతో గొడవపడి ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, మార్చి 14: మండలంలోని వడ్డాది గ్రామంలో వివాహిత ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. వడ్డాది సంతబయలు వద్ద తగుడుపల్లి తాతారావు, భార్య మహాలక్ష్మి(60) నివాసం వుంటున్నారు. వ్యవసాయ కూలీలైన వీరు ఇటీవల ఉమ్మడి గోదావరి జిల్లాలో మినుము, పెసర పంటల కోతల పనులకు వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి వడ్డాది వచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కొద్దిసేపటి తరువాత మహాలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయం గమనించిన తాతారావు, వెంటనే చికిత్స నిమిత్తం చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స చేయకముందే మృతిచెందింది. భర్త తాతారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

60 లీటర్ల నాటుసారా స్వాధీనం

బుచ్చెయ్యపేట, మార్చి 14: మండలంలోని నీలకంఠాపురంలో గురువారం నాటుసారా బట్టీపై దాడి చేసి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 500 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశామని, నాటుసారా బట్టీ నడుపుతున్న పడాల నాయుడును అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

మాసాహెబ్‌పేటలో 40 లీటర్లు...

పాయకరావుపేట, మార్చి 14: మాసాహెచ్‌పేట ప్రాంతంలో ఎస్‌ఈబీ అధికారులు 40 లీటర్ల నాటుసారాతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాసాహెచ్‌పేట వద్ద సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన దొంగల సత్యనారాయణ, గంటా వెంకటరమణ రెండు ప్లాస్టిక్ సంచుల్లో 40 లీటర్ల నాటుసారాను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

పురుషోత్తపురంలో మూడు ఇళ్లల్లో చోరీలు

ఎలమంచిలి, మార్చి 14: మండలంలోని పురుషోత్తపురంలో ఒకే కాలనీలోని మూడు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. రూరల్ ఎస్‌ఐ సింహాచలం తెలిపిన వివరాల ప్రకారం.. పురుషోత్తపురం దళిత కాలనీలో పి.శాంతికుమారి, వెంకట చినబ్బాయితోపాటు మరో వ్యక్తి ఇంట్లో బుధవారం రాత్రి చోరీలు జరిగాయి. సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితులు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాలను రూరల్ ఎస్‌ఐతో పాటు, క్లూస్‌టీమ్ సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

మసాజ్ సెంటర్‌లో పట్టుబడిన ఎస్‌ఐ

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మసాజ్ సెంటర్‌లో యువతులతో అభ్యంతరకరమైన స్థితిలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఒకరు పోలీసుల ఆకస్మిక దాడుల్లో పట్టుబడడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్పాల ముసుగులో చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో సీపీ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం రాత్రి ఆకస్మిక సోదాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో నగరంలోని 64 స్పా/మసాజ్ సెంటర్లలో 200 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మసాజ్ సెంటర్లలో యువతులతో మగవారికి మసాజ్ చేయిస్తుండడం, అభ్యంతరకరమైన రీతిలో మరికొందరు కనిపించడంతో పోలీసులు ఆయా సెంటర్లపై కేసులు నమోదుచేశారు. ఏడుగురు పురుషులను అరెస్టు చేశారు. అలాగే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 17 మంది యువతులను స్వధార్‌హోమ్‌కు అప్పగించారు. కాగా కంచరపాలెం స్టేషన్ పరిధిలోని ఒక మసాజ్ సెంటర్‌లో సోదాలు నిర్వహించేందుకు వెళ్లిన పోలీసులకు అభ్యంతరకరమైన రీతిలో ఒకరు పట్టుబడ్డారు. అతడిని విచారించగా తాను కంట్రోల్‌రూమ్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్నట్టు వెల్లడించాడు. పోలీసులు ఆ సమాచారం ఆధారంగా పోలీసులు ఆరా తీయగా 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్‌ఐగా తేలడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాల మేరకు అతనిపై కూడా విటుడిగా కేసు నమోదుచేశారు. .

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 14: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారులు బీఐఎస్ స్టాండర్డ్ లేని హెల్మెట్లు విక్రయించకుండా చూడాలని, వాటిని విక్రయించిన దుకాణాలపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్న బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ పోలీస్, రవాణాశాఖ అధికారుల సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరన్‌రాజ్, ఏఎస్పీ విజయభాస్కర్, జిల్లా రవాణా అధికారి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో అర్ధంతరంగా ముగిసిన విచారణ

చోడవరం, మార్చి 14: మండలంలోని గౌరీపట్నంలో భూముల రీసర్వేలో రెవెన్యూ సిబ్బంది నిర్వాకం, తదనంతర పరిణామాలపై గురువారం అధికారులు నిర్వహించిన గ్రామసభ ప్రజల అభ్యంతరాలతో అర్ధంతరంగా ముగిసింది. గౌరీపట్నంలో భూముల రీసర్వే సందర్భంగా అప్పటి వీఆర్వో, సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది కలిసి ఒకరి పేరిట ఉన్న భూములకు మరొకరి పేరుతో పట్టాలు జారీ చేయడం, రెవెన్యూ ఉద్యోగి ఒకరు తన పేరిట, తన కుటుంబ సభ్యుల పేరిట రైతుల భూములు నమోదు చేయడంపై గత ఏడాది డిసెంబరులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణకు కలెక్టర్ ఆదేశించగా అధికారులు గ్రామంలో విచారణ జరిపి సర్వేయర్ల తప్పిదాలు ఉన్నట్టు నిర్ధారించారు. బాధ్యులైన వీఆర్వో, సచివాలయం సర్వేయర్‌ను సస్పెండ్ చేశారు. అయితే సస్పెండైన వీఆర్వోకు తిరిగి పోస్టింగ్ ఇచ్చిన అధికారులు, సర్వేయర్‌పై వచ్చిన ఆరోపణలపై జిల్లా సర్వే అధికారి వెంకన్న ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించడానికి గురువారం గౌరీపట్నం వచ్చారు. తప్పులను సరిదిద్దకుండా వీఆర్వోకు తిరిగి పోస్టింగ్ ఇవ్వడంతోపాటు, సర్వేయర్‌కు తిరిగి పోస్టింగ్ ఇవ్వడానికి గ్రామసభ నిర్వహించడానికి రావడమేమిటేని ఎంపీటీసీ సభ్యుడు మంగా జగన్నాథరావు, తదితరలు నిలదీశారు. దీంతో అధికారులు విచారణ చేయకుండానే వెనుదిరిగారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

మామిడి తోటలు వెలవెల!

కాపులేక కళతప్పిన చెట్లు

- గత ఏడాది వర్షాభావంతో రెండు నెలలు ఆలస్యంగా పూత
- పొగమంచు ప్రభావంతో తెగుళ్లు విజృంభణ
- సగానికిపైగా రాలిపోయిన పూత
- మార్చి రెండో వారం గడుస్తున్నా కానరాని కాయలు
- ఎకరాకు రూ.30 వేల మేర పెట్టుబడి
- దిగుబడిపై ఆశలు వదులుకుంటున్న సాగుదారులు


బంగారుమెట్టలో పూత, పిందెలేని లేని మామిడి చెట్లు


ఎల్‌బీపీ అగ్రహారంలో పొగమంచు ప్రభావంతో మాడిపోయిన పూత

బుచ్చెయ్యపేట, మార్చి 14: ప్రస్తుత సమయానికి పిందెలు, కాయలతో కళకళలాడాల్సిన మామిడి తోటలు ఈ ఏడాది కనీస స్థాయిలో కూడా కాపు కాయక వెలవెల బోతున్నాయి. గత ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మామిడి చెట్లకు ఈసారి పూత ఆలస్యంగా, అంతంతమాత్రంగానే వచ్చింది. ఈ సమయంలో పొగమంచు దట్టంగా కురవడంతో తెగుళ్లు, కీటకాలు విజృంభించాయి. దీంతో పూత మాడిపోయింది, పిందెలు రాలిపోతున్నాయి. సగటు దిగుబడిలో నాలుగో వంతు కూడా రావడం కష్టమేనని మామిడి తోటల సాగుదారులు చెబుతున్నారు.

బుచ్చెయ్యపేట మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో మామిడి తోటలు వున్నాయి. ప్రతిఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో మామిడి తోటల్లో పూత వస్తుంది. జనవరిలో పిందెలు ఏర్పడి, ఫిబ్రవరి నుంచి కాయలుగా పెరుగుతాయి. ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ వరకు కాయలు కోస్తుంటారు. వాతావరణం అనుకూలిస్తే రకాన్నిబట్టి ఎకరాకు 5 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది మామిడి తోటల్లో కాపు ఆశాజనకంగా లేదు. గత ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు మామిడి రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. నవంబరు, డిసెంబర్‌లో పూతకు రావాల్సిన మామిడి చెట్లు.. డిసెంబరు మొదటి వారంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో పూత పూస్తున్నాయి. అది కూడా అరకొరగానే వచ్చింది. గతంతో పోలిస్తే 30 శాతం పూత కూడా రాలేదని రైతులు చెబుతున్నారు. ఇదే సమయంలో మంచు అధికంగా కురవడం, పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో తీవ్ర వ్యత్యాసం వుండడంతో తేనె మంచు, తామర పురుగులు, పేను బంక, మంగు వంటి తెగుళ్లు వ్యాపించి పూతకు నష్టం కలిగించాయి. మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయిందని సాగుదారులు వాపోతున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది టన్నుల వరకు మామిడి కాయల దిగుబడి వస్తుందని, ఈ ఏడాది రెండు టన్నులు దిగుబడి వస్తే గొప్ప విషయమని అంటున్నారు.

ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశాను



నాకు ఐదు ఎకరాల మామిడి తోట వుంది. కలుపు తీత, నీటి తడులు, సూక్ష్మపోషకాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలి ఖర్చులు కలిపి ఇంతవరకు ఎకరాకు రూ.30 వేల చొప్పున లక్షన్నర రూపాయలు అయ్యింది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించక పోవడంతో తక్కువ పూత.. అది కూడా ఆసల్యంగా వచ్చింది. ఇదే సమయంలో మంచు అధికంగా కురవడంతో చాలా వరకు రాలిపోయింది. దీంతో కాపు బాగా తగ్గిపోయే పరిస్థితి నెలకొంది. పెట్టుబడి కూడా వచ్చేలా లేదు.

సాయం రఘునాథ్, మామిడి రైతు, బంగారుమెట్ట

కూటమి అధికారంలోకి వస్తేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ


ర్యాలీలో పాల్గొన్న జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు

కొత్తూరు, మార్చి 14 : రాష్ట్రంలో యువత భవిష్యత్తు బాగుపడాలంటే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకి రావాల్సిందేనని జనసేన పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం మళ్ల బ్రదర్స్ కూడలి మీదుగా నెహ్రూచౌక్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పొన్నగంటి అప్పారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మూడు పార్టీల నాయకులు కాయల మురళి, నిమ్మదల సన్యాసిరావు, డాక్టర్ నారాయణరావు, బొలిశెట్టి సత్యనారాయణ, దూలం గోపీ, మళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట సభను విజయవంతం చేద్దాం

తుమ్మపాల, మార్చి 14 : టీడీపీ, జనసేన, బీజేపీల ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో ఈ నెల 17న జరగనున్న భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర నుంచి బహిరంగసభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలన్నారు. ఈ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పాల్గొంటారని చెప్పారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు


మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో శ్రీగౌరి

కృష్ణాదేవిపేట, మార్చి 14 : గొలుగొండ ఏఎల్‌పురం గొల్లవీధిలో గురువారం బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఏఎల్‌పురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక(15)ను, అడ్లబోయిన సాయికృష్ణ(19)కు ఇచ్చి ఈ నెల 15వ తేదీన వివాహం చేయాలని ఇరుకుటుంబాల పెద్దలు ఇటీవల నిశ్చయించుకున్నారు. దీనిపై ఐసీడీఎస్ గొలుగొండ సీడీపీవో శ్రీగౌరికి, స్థానిక సూపర్‌వైజర్ సత్యశ్రీకి సమాచారం అందింది. గురువారం పోలీసుల సహకారంతో బాలిక, యువకుడి ఇళ్లకు వెళ్లారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. తమ మాట కాదని పెళ్లి చేస్తే.. కుటుంబ సభ్యులు, పెళ్లి పెద్దలపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యపరంగా ఏర్పడే ఇబ్బందుల గురించి ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో పెళ్లిని వాయిదా వేసుకుంటున్నట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ రామారావు, అంగన్‌వాడీ కార్యకర్త మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక నిఘా

- డీఎఫ్‌ఓ జగన్నాథ్‌సింగ్


విలేకర్లతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో జగన్నాథసింగ్ (ఎడమ వైపు)

కృష్ణాదేవిపేట, మార్చి 14: కలపను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) జగన్నాథ్ సింగ్ హెచ్చరించారు. ఆయన గురువారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయాన్ని, కొప్పుగొండ-నల్లగొండ అటవీ ప్లాంటేషన్లు, చింతాలమ్మఘాట్ రోడ్డులో జాతీయ రహదారి నిర్మాణం కోసం నరికివేసిన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణాదేవిపేటలో మీడియాతో మాట్లాడుతూ, పాతకృష్ణాదేవిపేట, పల్లావూరు, ఏఎల్‌పురం, తదితర గ్రామాల్లో ఫర్నీచర్ తయారీదారులు అటవీ శాఖకు నిర్ణీత ఫీజు చెల్లించిన తరువాత సామగ్రిని ఇతర ప్రాంతాలకు రవాణా చేయాలని స్పష్టం చేశారు. కలప అక్రమ రవాణాను నిరోధించడానికి చెక్‌పోస్టులు వద్ద నిఘాను పెంచుతామని చెప్పారు. ఆయన వెంట కృష్ణాదేవిపేట రేంజర్ సుంకర వెంకటరావు వున్నారు.

3,664 మందికి ఈబీసీ నేస్తం


నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 14: జిల్లాలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద మూడవ విడతలో 3664 మంది లబ్ధిదారులకు రూ.ఐదు కోట్ల 49 లక్షల 60 వేలు ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం లబ్ధిదారులకు కలెక్టర్ నమూనా చెక్కును అందజేశారు. అంతకు ముందు నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఈబీసీ నేస్తం కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు అధికారులు, లబ్ధిదారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు వినూత్న పరికరం తయారీ


పరికరాన్ని తయారు చేసిన విద్యార్థినులతో విభాగాధిపతులు

అనకాపల్లి టౌన్, మార్చి 14: స్థానిక దైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు మహిళల భద్రతకు ఓ వినూత్న పరికరాన్ని తయారు చేశారు. ఈ పరికరంతో ఆకతాయిల పని పట్టించ వచ్చునని ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణప్రియ తెలిపారు. ప్రాజెక్టు గైడ్ ఎం.హేమలత, ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు సూచనల మేరకు ఈ పరికరాన్ని వైనిహారిక, పి.హేమలత, బి.ఓంసాయి, వాసంతి అనే విద్యార్థులు తయారు చేశారని పూర్ణ ప్రియ తెలిపారు. ఈ పరికరానికి అమర్చిన బటన్ నొక్కడం ద్వారా ఆపత్కాల సమయంలో మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు తెలిపారు. ఈ పరికరం తయారీకి ఫ్రీక్వెన్సీ ట్రాన్స్ ఫార్మర్, స్పార్క్ గ్యాప్ కెపాసిటర్, ఆన్ అండ్ ఆఫ్ స్విచ్, ఫ్రీక్వెన్సీ ట్రాన్సిస్టర్, రీచార్జబుల్ బ్యాటరీ వాడినట్లు విద్యార్థినులు తెలిపారు. ఈ పరికరం తయారు చేయడానికి కేవలం రూ.350లు ఖర్చు చేసినట్టు ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు తెలిపారు.

పెందుర్తి సీటు బండారుకే కేటాయించాలి

- టీడీపీ శ్రేణుల ఆందోళన

పరవాడ, మార్చి 14: పెందుర్తి సీటును తెలుగుదేశం పార్టీ తీసుకుని, బండారు బండారు సత్యనారాయణమూర్తిని అభ్యర్థిగా ప్రకటించాలని ఆ పార్టీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. పొత్తులో భాగంగా పెందుర్తి నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించడంపై టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. గురువారం మండలంలోని వెన్నెలపాలెంలో గల బండారు ఇంటి వద్దకు చేరుకుని నిరసన తెలియజేశాయి. పెందుర్తి టికెట్ విషయంలో అధినేత చంద్రబాబునాయుడు మరోసారి పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. తామంతా ప్రస్తుతం పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నామని, రెండు రోజుల్లోగా టికెట్‌ను బండారుకు కేటాయిస్తున్నట్టు ప్రకటన చేయకపోతే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, గండి దేముడుబాబు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, పార్టీ నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, వియ్యపు చిన్న, ఇందల కొండలరావు, కొటాన అప్పారావుతో పాటు పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఉన్నారు.


బండారు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

టీడీపీకి గండి బాబ్జీ రాజీనామా

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ గురువారం పార్టీకి రాజీనామా చేశారు. పొత్తుల్లో భాగంగా దక్షిణ నియోజక వర్గాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో తనకు మాడుగుల సీటు ఇస్తారని బాబ్జీ ఆశించారు. అయితే అధిష్ఠానం గురువారం విడుదల చేసిన మలి జాబితాలో మాడుగుల అభ్యర్థిగా పైలా ప్రసాదరావును ప్రకటించింది. దీంతో మనస్తాపానికి గురైన బాబ్జీ..దక్షిణ ఇన్‌చార్జి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పెందుర్తి నుంచి 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన బాబ్జీ, 2014 తరువాత టీడీపీలో చేరారు.


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రామ్‌చరణ్

విశాఖకు రామ్‌చరణ్

విశాఖపట్నం, మార్చి 14: ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'గేమ్ ఛేంజర్' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు గురువారం నగరానికి విచ్చేసిన సినీ హీరో రామ్‌చరణ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాత్రి తొమ్మిది గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయనకు పెద్దసంఖ్యలో అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం రామ్‌చరణ్ రోడ్డు మార్గంలో హోటల్ నోవాటెల్‌కు వెళ్లారు.

టీడీపీ అరకు ఎన్నికల పరిశీలకుడిగా సబ్బవరపు గణేశ్

అనకాపల్లి టౌన్, మార్చి 14: అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకు పార్లమెంట్, అరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా అనకాపల్లికి చెందిన ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ద్వారా ఉత్తర్వులు అందాయని గణేశ్ తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తానని, పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 14 వేల మంది హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 14: జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రసాయన శాస్త్రం-1, కామర్స్ -1 పరీక్షలకు 14 వేల మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 14,598 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 598 మంది హాజరు కాలేదని తెలిపారు.





CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **SHAIK MADEENA SHAHEB** (Old Name), S/o. Shaik Narayana, resident of 27-4-20/1, Old Kamavanipalem, Old Gajuwaka, Visakhapatnam. Change my name from **SHAIK MADEENA SHAHEB** (Old Name) to **SHAIK MADEENA** (New Name) hence forth I am being called as **SHAIK MADEENA** (New Name), S/o. Shaik Narayana, for all purposes.
AJV_ 182780

CHANGE OF NAME

★ I, **SHAMEEM** (Old Name), W/o. Abdul Raheem, resident of Flat No.501, Sampath Sai Enclave, APHB Colony, PM Palem, GVMC, Visakhapatnam-41. Change my name from **SHAMEEM** (Old Name) to **SYED SHAMEEM** (New Name) hence forth I am being called as **SYED SHAMEEM** (New Name), W/o. Abdul Raheem, for all purposes.
AJV_182781

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పాడేరులో నిఘా వ్యవస్థ పటిష్ఠం

▸ 22 జంక్షన్లలో 40 సీసీ కెమెరాల ఏర్పాటు



పాడేరులో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎంపీ మాధవి, ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరురూరల్, మార్చి 14 : పాడేరులో నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని ఎంపీ జి.మాధవి తెలిపారు. గురువారం ఆమె ఎస్పీ తుహిన్‌సిన్హా, ఏఎస్పీ ధీరజ్‌లతో కలిసి సీసీ కెమెరాలు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ప్రారంభించారు. అనంతరం వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడేరులో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు ఎంపీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో పట్టణంలోని 22 ప్రధాన కూడళ్లలో 40 హైపవర్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కెమెరాల మానెటరింగ్‌కు సీఐ కార్యాలయంలో రెండు ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్, ఎస్ఐ జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

దొడ్డిదారిన టీచర్ల బదిలీ

▸ జిల్లాకు చేరిన ఉత్తర్వులు

▸ మొత్తం 90 మందికి విశాఖ నగరం, చుట్టుపక్కల పోస్టింగ్

▸ ఏజెన్సీ నుంచి 70 మంది ఎస్జీటీలు...

▸ ఈ ఏడాది జూన్‌లో ఖాళీ కానున్న పోస్టుల్లో నియామకం

▸ బదిలీల్లో రూ. 3.5 కోట్లు సొమ్ములు వసూళ్లు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖ వింత పోకడలు పోతోంది. ఈ ఏడాది జూన్ నెలాఖరుకు ఖాళీ కానున్న పోస్టుల్లో ఇప్పుడే పలువురిని నియమిస్తూ ఆదేశాలు ఇస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా అంటే దొడ్డిదారిన ఉమ్మడి జిల్లాలో సుమారు 90 టీచర్లను తాము పనిచేసే పాఠశాలల నుంచి కోరుకున్న చోటకు బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖకు అందాయని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.3.5 కోట్లు వరకూ చేతులు మారాయని, అధికార పార్టీ కీలక నేత పీఏ సూత్రధారిగా వ్యవహరించారని సమాచారం. ఏజెన్సీలో పనిచేస్తున్న సుమారు 70 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు విశాఖ నగరం, పరిసరాలు, మైదాన ప్రాంతంలో స్కూళ్లలో పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం ఖాళీలు లేవు. రానున్న రెండు, మూడు నెలల్లో పలువురు టీచర్లు పదవీ విరమణ చేయనున్నారు. అప్పటివరకూ ఆయా ఉపాధ్యాయులు (ప్రస్తుతం బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్నవారు) ప్రస్తుతం పనిచేసే పాఠశాలల్లోనే పనిచేస్తారు. ఈ మేరకు విశాఖ జిల్లా శాఖాధికారి కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చినా గోప్యంగా ఉంచుతోంది.

గాజువాకపై వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

లైన్‌క్లియర్ అయ్యింది. ఈ మేరకు అధిష్ఠానం పల్లా శ్రీనివాసరావు పేరును అధికారికంగా ప్రకటించింది.

పల్లా రాజకీయ నేపథ్యం

పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం కార్మిక నాయ కులు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు విశాఖ-2 సెగ్మెంట్ నుంచి తెలుగుదేశం తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తండ్రికి రాజకీయాల్లో శ్రీనివాసరావు చేదోడువాదోడుగా ఉండేవారు. 2009లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ప్రజారాజ్యం పార్టీలో చేరి విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మూడు లక్షలకుపైగా ఓట్లు సాధించారు. ఆ తరువాత ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం అయ్యింది. రాష్ట్ర విభజన అనంతరం 2014 సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరి గాజువాక నుంచి పోటీ చేసి 22 వేల మెజారిటీతో విజయం సాధించారు. 2019లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ నియోజవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత పటిష్ఠ పరిచారు. ఈ క్రమంలోనే 2020లో జిల్లా పార్టీ అధ్యక్షుని పగ్గాలు చేపట్టారు.

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ

... 5వ పేజీ తరువాయి

స్టేషన్‌కు వెళ్లిన అతని స్నేహితుడు శ్రీకాంత్ వద్ద సెల్‌ఫోన్ లాక్కొని, రూ.30 వేలు ఇచ్చిన తర్వాత సెల్‌ఫోన్ పట్టుకువెళ్లాలని చెప్పారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు 1440 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం గురువారం బాధితుడికి రూ.పది వేలు ఇచ్చి స్టేషన్‌కు పంపించారు. ఆ మొత్తాన్ని ఎస్ఐ హరికృష్ణ స్వయంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

ఇదిలావుండగా లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ హరికృష్ణ మొదటి నుంచి వివాదాస్పదుడేనని పోలీస్ వర్గాలు పేర్కొంటున్నాయి. 2012 బ్యాచ్‌కు చెందిన హరికృష్ణ నగరంలో స్పెషల్‌బ్రాంచిలో కొన్నాళ్లు పనిచేసి, రాజకీయంగా తనకున్న పలుకుబడిని ఉపయోగించి సొంత జిల్లా అయిన శ్రీకాకుళానికి బదిలీ చేయించుకున్నారు. కొన్నాళ్ల కిందట టెక్కలిలో పనిచేస్తుండగా వైసీపీ నేత పుట్టినరోజు వేడుకల సందర్భంగా వేదికపైకి ఎక్కి మహిళలతో కలిసి డ్యాన్స్ చేసినట్టు సమాచారం. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో అధికారులు వీఆర్‌కు సరండర్ చేశారు. అయితే తన రాజకీయ పలుకుబడితో తిరిగి పోస్టింగ్ సంపాదించుకున్నాడని చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు నేపథ్యంలో కొద్దిరోజుల కిందట నగరానికి బదిలీపై వచ్చిన హరికృష్ణ లంచం కోసం డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు.

ఏకలవ్యలో ప్రవేశాలకు వేళాయె

... 5వ పేజీ తరువాయి

కుటుంబాల పిల్లలకు 3, తీవ్రవాద దాడులు, కొవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలలకు ఆరు సీట్లు కేటాయించారు. ఈ ఆరు సీట్లు ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ కులాల విద్యార్థులకు కేటాయించారు.

దరఖాస్తుకు ఈ నెల 31 తుదిగడువు

ఈ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 31 తేదీ తుదిగడువు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రస్తుతం ఐదో తరగతిలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్యాభ్యాసం చేస్తూ మార్చి 31కి 10-13 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి. తెల్ల రేషన్ కార్డు కలిగి వార్షిక ఆదాయం రూ.లక్ష మించని కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రవేశాలకు అర్హులు. ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో పాస్‌పోర్టు సైజు ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాల్సి వుంటుంది. దరఖాస్తులో తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్, కులం, నివాస స్థలం, రేషన్‌కార్డు ధ్రువీకరణ పత్రాల రిజిస్టర్ నంబర్లు నమోదు చేయాల్సి వుంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింట్ అవుట్‌ను సమీపంలో ఉన్న ఈఎంఆర్ పాఠశాలకు అందజేయాలి. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్, కుల, నివాస స్థలం, రేషన్, దివ్యాంగుల ధ్రువీకరణ, స్టడీ, పుట్టిన తేదీ, క్రీడల ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతచేయాలి.

పరీక్షా కేంద్రాలు

ఆరో తరగతిలో ప్రవేశాలు పొందేందుకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో చింతపల్లి బాలుర గురుకుల కళాశాల, పాడేరు బాలికల గురుకుల కళాశాల, అరకులోయ బాలికల గురుకుల కళాశాల, రంపచోడవరం బాలికల గురుకుల కళాశాల, చింతూరు పీవీటీజీ బాలిక పాఠశాల, రాజవొమ్మంగి బాలికల గురుకుల కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థి దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఈ కేంద్రాలను ఎంపిక చేసుకోవాల్సి వుంటుంది.

అత్యాధునిక సదుపాయాలు

ఈ పాఠశాలల్లో విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తరగతిలో కూర్చోవడానికి వ్యక్తిగత కుర్చీలు, డెస్కులు ఉంటాయి. వసతి గృహాల్లో నిద్రించేందుకు మంచాలు ఉన్నాయి. శాశ్వత భవనాలు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో నలుగురు విద్యార్థులకు ఒక గది కేటాయించారు. సువిశాలమైన తరగతి గదులు, క్రీడామైదానం అందుబాటులో ఉన్నాయి. నాణ్యమైన పోషకాహారం కలిగిన మెనూ అమలు చేస్తున్నారు. పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, బెడ్‌షీట్, రగ్గులు, ప్లేట్, గ్లాస్, షూ, టై, పెట్టె ఉచితంగా అందజేస్తారు. బాలబాలికలకు రక్షణగా మూడు నుంచి ఐదుగురు సెక్యూరిటీ గార్డులు ఉన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

▸ గిరిజనులకు జిల్లా కలెక్టర్ విజయ సునీత పిలుపు ▸ పలు గ్రామాల్లో ఈవీఎంల వినియోగంపై అవగాహన సదస్సులు



ఈవీఎంపై పెదగూడలో అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ విజయ సునీత

ముంచంగిపుట్టు, మార్చి 14 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ సునీత అన్నారు. ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలి అనే అంశంపై గురువారం మండలంలోని పెదగూడలో గ్రామస్థులకు ఇక్కడ అవగాహన కల్పించారు. డమ్మీ ఈవీఎంలను ఏర్పాటు చేయించి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటును ఏ విధంగా వేయాలి, తమ ఓటు పడిందో లేదో ఏవిధంగా తెలుసుకోవాలి తదితరాలను వారికి చూపించారు. ప్రభుత్వం జారీ చేసిన 18 రకాల కార్డులలో ఏ ఒక్క గుర్తింపు కార్డుతోనైనా ఓటు హక్కును వినియోగించుకోవచ్చునన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటును వేయాలని ఆమె సూచించారు. అనంతరం ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆమె సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్ శర్మ, ఎంపీడీవో కిరణ్ కుమార్, తహసీల్దార్ రఫీ జాన్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు : ప్రజలు ఓటు హక్కుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ సునీత అన్నారు. గురువారం సాయంత్రం ఆమె పెదబయలు విచ్చేసి అంబేడ్కర్ పార్కు వద్ద ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు ఆవశ్యకతను వివరించడంతో పాటు ఈవీఎంల ద్వారా ఎలా ఓటు వేయాలో తెలియజేశారు. పోలింగ్ బూత్‌లలో పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'జిల్లాలో 576 మందికి ఈబీసీ నేస్తం'

పాడేరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 576 మంది మహిళలకు ఈబీసీ నేస్తం పథకం కింద లబ్ధి చేకూరిందని, వారి ఖాతాల్లో రూ.80.40 లక్షలు జమ కానున్నాయని జిల్లా కలెక్టర్ విజయసునీత వెల్లడించారు. ఈబీసీ నేస్తం పథకం కింద సాయాన్ని అందించేందుకు సీఎం జగన్ నంద్యాల జిల్లా బనగానపల్లెలో గురువారం బటన్ నొక్కుడు కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం ఇక్కడి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం పలువురు లబ్ధిదారులతో కలిసి నమూనా చెక్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, బీసీ కార్పొరేషన్ ఏఈవో కె.శంకరరావు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

▸ వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా సమస్యలే ▸ అరకులోయ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దొన్నుదొర



హుకుంపేటలో టీడీపీ నాయకులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి దొన్నుదొర

హుకుంపేట, మార్చి 14 : గిరిజన ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారం కావాలన్నా, గిరిజనులు అభివృద్ధి సాధించాలన్నా చంద్రబాబు వంటి సమర్థ నాయకుడు రాష్ట్రానికి అవసరమని అరకు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సివేరి దొన్నుదొర అన్నారు. మండల కేంద్రం హుకుంపేటలో గురువారం ఆయన పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వైసీపీకి ఈ నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు ఓటర్లు పట్టం కట్టినా ఎక్కడా అభివృద్ధి జాడ కానరాలేదన్నారు. ఎక్కడికి వెళ్లినా సమస్యలు కనిపిస్తున్నాయని, ఆయా ప్రాంతాల ప్రజలు తమ కష్టాలను చెప్పుకుని బాధపడుతున్నారని వాపోయారు. జగన్ పాలనపై అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. మళ్లీ మనందరి కష్టాలు తీరాలంటే ప్రతి ఒక్కరూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పార్టీ శ్రేణులు కూడా ఎన్నికలు ముగిసే వరకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై నియోజకవర్గ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంతల నాగేశ్వరరావు, శ్యామ్, కొమ్మర సూర్యాకాంతం, జ్ఞాన ప్రకాశ్, శంకర్ నాయుడు, బాకూరు రమణ, సుబ్బారావు పండన్న, అర్జున్, ప్రసాద్, చంటి, నాగరాజు, మత్స్యరాజు రాజారావు, లక్ష్మయ్య, బొంజుబాబు బాలన్న తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



మాలివలసలో దొన్నుదొర తరఫున ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

మాలివలసలో

అరకులోయ : గిరిజనాభివృద్ధి జరగాలంటే అరకులోయ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి దొన్నుదొరను గెలిపించాలని టీడీపీ అరకులోయ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు పిలుపునిచ్చారు. మండలంలోని చినలబుడు పంచాయతీ మాలివలసలో దొన్నుదొర తరఫున పెదలబుడు, నలబుడు సర్పంచ్‌లు పెట్టెలి దాసుబాబు, ఉపేంద్రలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ పాలనలో వైఫల్యాలను వివరించారు. టీడీపీని గెలిపిస్తే చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దొన్ను, మాజీ సర్పంచ్ గొల్లోరి సుబ్బారావు, మాదల ఎంపీ టీసీ సభ్యుడు అభిమన్, పార్టీ నాయకులు నాగరాజు, లవకుశ, భగత్‌రాం, గొల్లోరి రాజు తదితరులు పాల్గొన్నారు

119 మంది సీఆర్‌టీలకు రెగ్యులరైజేషన్ : పీవో



సీఆర్‌టీకి రెగ్యులర్ ఉత్తర్వులు అందిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో విడతలో మరో 119 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ల సర్వీసును రెగ్యులరైజేషన్ చేశామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్పష్టం చేశారు. రెండో విడతలో రెగ్యులరైన వారికి ఉత్తర్వులు అందించేందుకు గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రెగ్యులరైజేషన్ చట్టం ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. ప్రతి గిరిజన విద్యార్థి ఉన్నతంగా ఎదిగేలా విద్యనందించాలని టీచర్లకు సూచించారు. త్వరలో వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ సంచాలకులు, తెలుగు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడు ఐ. కొండలరావు, టీచర్లు పాల్గొన్నారు.

వంజంగి పర్యాటక ప్రాంతంలో అభివృద్ధి పనులు



బయో టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ బొంజుబాబు

పాడేరురూరల్, మార్చి 14 : ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన మండలంలోని వంజంగి మేఘాల పర్వతం పరిధిలో గల మూడు పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎంపీడీవో కె.సాయి నవీన్ తెలిపారు. గురువారం వంజంగి పంచాయతీ బొర్ర మామిడి గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డును సర్పంచు వి.బొంజుబాబు, ఎంపీటీసీ లకే రామకృష్ణపాత్రుడుతో కలిసి ప్రారంభించారు. అలాగే, వంజంగి మేఘాల పర్వతం సమీపంలో పర్యాటకులకు అనువుగా ఉండేలా బయో టాయిలెట్స్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో వంజంగి ఎకో-టూరిజం పరిధిలోని వంజంగి, లగిశపల్లి, కాడెలి పంచాయతీల్లో 16 అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, సచివాలయ సిబ్బంది, ఎకో-టూరిజం సభ్యులు పాల్గొన్నారు.

కురిడి పంచాయతీ కార్యదర్శికి షోకాజ్

డుంబ్రిగుడ, మార్చి14 : మండలంలో ఐటీడీఏ పీవో అభిషేక్ గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. కురిడి, డుంబ్రిగుడ, రంగిలిసింగి, కుజభంగిలోని పదిహేను పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కురిడి పోలింగ్ కేంద్రంలో బీఎల్‌వో అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఆయన పంచాయతీ కార్యదర్శి మీనాక్షికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని మండల ఏఈఆర్‌వోను ఆదేశించారు. ఆయన వెంటన పలువురు అధికారులు ఉన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

కొయ్యూరు, మార్చి 14 : మండల కేంద్రం కొయ్యూరులో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా కేక్ కట్, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయమే పార్టీ శ్రేణుల లక్ష్యం కావాలన్నారు. నాయకులు సాగిన బుజ్జిబాబు, శేషుబాబు, రాజేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట : జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని హుకుంపేటలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ సమీపంలో జెండాను ఆవిష్కరించి బైక్ ర్యాలీ జరిపారు. సీనియర్ నాయకురాలు కొర్రా సరస్వతితో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఆఫ్‌లైన్‌లోనే రేషన్ సరకులు : జేసీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాడేరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో నెట్‌వర్క్ సమస్య కారణంగా లబ్ధిదారులకు ఆఫ్‌లైన్‌లోనే రేషన్ పంపిణీ చేపట్టనున్నామని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ గురువారం తెలిపారు. జిల్లాలో కొత్తగా 256 రేషన్ దుకాణాల్లో ఈనెల ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో రేషన్ పంపిణీ ప్రారంభించారన్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య కారణంగా లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ కాకపోవడంతో రేషన్ పొందని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈనేపథ్యంలో ఏర్పడిన సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన పలు కథనాలకు జాయింట్ కలెక్టర్ స్పందించారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, ఈ నెలలో ఆన్‌లైన్ ప్రక్రియ ప్రవేశపెట్టిన 256 రేషన్ దుకాణాల్లో ఆఫ్‌లైన్‌లోనే రేషన్ పంపిణీ చేసేందుకు అనుమతి పొందారు. దీంతో ఇన్నాళ్లు ఆఫ్‌లైన్‌లో రేషన్ పొందిన లబ్ధిదారులు ఇకపై అదే తరహాలో పొందవచ్చునని వివరించారు. ఆయా లబ్ధిదారులు ఈ నెల17 తేదీలోగా తమ రేషన్ సరుకులను ఆయా ఏండీయూ వద్ద పొందాలని సూచించారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు జరుపుతున్న అంగన్‌వాడీలు

చింతపల్లి, మార్చి 14 : గర్భిణులు, బాలింతలు సకాలంలో పోషకాహారాన్ని తీసుకోవాలని సీడీపీవో బీవీ రమణ సూచించారు. గురువారం చింతపల్లిలో పోషన్ పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు సత్యవతి, గౌహర్ ఉన్నీషా, విజయకుమారి, రామలక్ష్మి, అప్పలనర్స, గౌరి పాల్గొన్నారు.

సూర్యనారాయణ ఆలయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మాధవి

పాడేరు రూరల్, మార్చి 14 : డి.గొందూరు పంచాయతీ నూకురుపుట్టులో సూర్యనారాయణస్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఎంపీ జి.మాధవి గురువారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆమె సూచించారు. సర్పంచ్ సీదరి రాంబాబు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆలయ ప్రధాన అర్చకులు కూడా రామకృష్ణ పరమహంస, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు స్పందన

పాడేరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ విజయసునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఏజెన్సీ ప్రాంతం ప్రజలు గమనించి తమ సమస్యలపై అర్జీలను స్పందనలో సమర్పించాల్సిందిగా కోరారు. అలాగే, వివిధ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం ఉదయం పది గంటలకే ఐటీడీఏ కార్యాలయానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



విద్యార్థికి పరీక్ష కిట్టు అందిస్తున్న ఎంపీపీ అనూషాదేవి

చింతపల్లి, మార్చి 14 : పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో రాయాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి సూచించారు. ఇక్కడి గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాల-2లో పదో తరగతి విద్యార్థులకు వైఎస్ఆర్ టీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ టి.సురేశ్ కుమార్ సమకూర్చిన పరీక్ష కిట్లను గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పండన్న, వైసీపీ మండల అధ్యక్షుడు మోరి రవి తదితరులు పాల్గొన్నారు.

17న మోదకొండమ్మ ఉత్సవాల తేదీ ఖరారుకు సమావేశం



పాడేరు రూరల్, మార్చి 14 : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మ పండగ తేదీలు ఖరారుతో పాటు ఉత్సవ కమిటీ ఏర్పాటుకు ఈనెల 17వ తేదీ ఆదివారం సమావేశాన్ని నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రారంభం కానున్న ఈ సమావేశానికి భక్తులు, పురప్రజలు, ఆధ్యాత్మిక సేవా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, వర్తక సంఘ ప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

స్వచ్ఛందంగా పోలీసులకు తుపాకీ అప్పగింత



నాటు తుపాకీని సీఐకి అప్పగించిన బుచ్చిబాబు

కొయ్యూరు, మార్చి 14 : మండలంలోని బళ్ళింత గ్రామానికి చెందిన పాంగి బుచ్చిబాబు తన వద్ద గల నాటు తుపాకీని పోలీసులకు గురువారం స్వచ్ఛందంగా అప్పగించాడు. ఈ సందర్భంగా సీఐ పీవీ రమణ మాట్లాడుతూ కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా నాటుతుపాకీలు, ఆయుధాలను కలిగి ఉండేవారంతా స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్ అప్పగించాలని పిలుపు నిచ్చామన్నారు. ఈ మేరకు చిట్టిబాబు నాటుతుపాకీని అప్పగించినట్టు చెప్పారు. అలాగే, ఎవరి వద్దనైనా ఇటువంటి తుపాకీలు ఉంటే వెంటనే సరెండర్ చేయాల్సిందిగా సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పది లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

జి.మాడుగుల, మార్చి 14 : పది లీటర్ల సారాతో ఓ వ్యక్తి అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. సొలభం కూడలిలో గురువారం వాహన తనిఖీలు చేపడుతున్న సమయంలో ప్లాస్టిక్ క్యాన్‌లో సారాను తరలిస్తూ అదే పంచాయతీ మలకర్రలతోగు గ్రామానికి చెందిన వంతాల వెంకటరావు కనిపించాడన్నారు. తమను చూసి భయంతో పారిపోతుండగా, పట్టుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

క్షయ వ్యాధిపై భయందోళన వద్దు



అవగాహన సదస్సు నిర్వహిస్తున్న డాక్టర్ సౌమ్య

హుకుంపేట, మార్చి 14 : క్షయ వ్యాధిపై ప్రజలు భయాందోళన చెందాల్సిన పనిలేదని డాక్టర్ సౌమ్య అన్నారు. మండలంలోని చికుమద్దుల గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఈ వ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం 14 మంది నుంచి పరీక్షల నిమిత్తం కఫం నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీబీ నివారణ విభాగం సూపర్‌వైజర్ సదానందం, ఉపాధ్యాయు, హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

సమస్యలపై పీవీటీజీలు ఆందోళన

కొయ్యూరు, మార్చి 14 : పీఎం జన్మన్ పథకాన్ని ప్రతి పీవీటీజీ కుటుంబానికి అందించాలని కోరుతూ పీవీటీజీలు, సీఐటీయూ నాయకులు గురువారం డౌనూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మారుమూల పీవీటీజీలకు ఒక్క కొత్త పథకం కూడా దరి చేరలేదని ఆరోపించారు. గతంలో పీవీటీజీలకు అమలులో ఉన్న అంత్యోదయ కార్డులు కూడా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. మారుమూల గ్రామాలకు రహదారి కల్పించాలని నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు వై.అప్పలనాయుడు, గిరిజన సంఘం నాయకుడు గెమ్మెల సానా తదితరులు పాల్గొన్నారు.

'కిడ్నీపై అప్రమత్తంగా ఉండాలి'

పాడేరు రూరల్, మార్చి 14 : ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని స్థానిక ఏఎన్ఎం శిక్షణ కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. శిక్షణ పొందుతున్న 50 మంది విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.విశ్వామిత్ర మాట్లాడుతూ మూత్రపిండం పనితీరు, ఆవశ్యకత గురించి వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ భాషా, శిక్షణ కేంద్రం ప్రతినిధి ఎస్‌వీ రమణి, జ్ఞానేశ్వరి, డయాల్సిస్ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.